క్లుప్తంగా

సత్తుపల్లి ఏఎంవీఐగా రాజశేఖర్‌రెడ్డి


రాజశేఖర్‌రెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి రవాణాశాఖ కార్యాలయంలో ఏఎంవీఐగా ఎస్.రాజశేఖర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎంపికైన ఆయనను శిక్షణ అనంతరం జిల్లాకు కేటాయించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి కార్యాలయంలో నియమించడంతో విధుల్లో చేరగా ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటకృష్ణ

తల్లాడ: వాహనదారులు నిబంధనలను అతిక్రమించినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా చర్యలు తప్పవని తల్లాడఎస్‌ఐ ఎన్.వెంకట కృష్ణ హెచ్చరించారు. తల్లాడలో మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించగా, ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సీజ్ చేయడమే కాక కేసు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే, ప్రధాన రహదారులపై ప్రమాదం జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని సూచించారు. ట్రెయినీ ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేషనల్ హైవేను తవ్వేస్తున్నారు..


హైవేపై తవ్వి వదిలేసిన ప్రాంతం

సత్తుపల్లి: అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్డుపై తారు కరిగి ఎగుడుదిగుడుగా మారగా.. ఏకంగా సత్తుపల్లిలో జాతీయ రహదారిని రామాలయం సమీపాన అడ్డంగా తవ్వి కేబుల్ వేయడం చర్చనీయాంశంగా మారింది. సత్తుపల్లి ప్రధాన రహదారి డివైడర్లపై ప్రకటన బోర్డుల ఏర్పాటుకు మున్సిపాలిటీ అనుమతి ఇచ్చింది. ఒక్కో బోర్డుకు రూ.2వేల చొప్పున వంద బోర్డుల ఏర్పాటుకు మధిర వాసి శ్రీనివాస్ దక్కించుకున్నాడు. అయితే, బోర్డులకు లైట్లు పెట్టేందుకు కేబుల్ ఏర్పాటుకు జాతీయ రహదారిని తవ్వి వదిలేశారు. ఇటీవల వర్షాలకు ఆ గుంతలు పెద్దగా మారుతున్నాయి. ఈ విషయమై టీపీఓ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఇంజనీరింగ్‌శాఖ టెండర్లు పిలవగా.. అందులోనే రోడ్డు కటింగ్, విద్యుత్ అనుమతులు ఉంటాయని తెలిపారు. మున్సిపాలిటీ తరఫున కేవలం పర్యవేక్షిస్తామని ఆయన వెల్లడించారు.

నిరీక్షణకు అర్ధశతాబ్దం..


కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న జెడ్పీహెచ్‌ఎస్ భవనాలు

- తల్లాడలో అందని ద్రాక్షగానే ప్రభుత్వ జూనియర్ కాలేజీ
- ప్రైవేట్‌కు వెళ్లలేక చదువుకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- అన్ని అనుకూలతలు ఉన్నా పట్టింపు లేని నేతలు

తల్లాడ: సుమారు యాభై ఏళ్లుగా నిరీక్షిస్తుండగా.. ఏటా వందలాది మంది పదో తరగతి పూర్తి చేస్తున్నా.. తల్లాడ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కల మాత్రం నెరవేరడం లేదు. ఇక్కడ ప్రభుత్వ కాలేజీ లేకపోవడంతో కాస్త ఆర్థికస్థోమత ఉన్న వారు ప్రైవేట్ కళాశాలల్లో చేరుతున్నప్పటికీ మిగతా వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. తల్లాడ మండలంలో ఆరు జెడ్పీ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండగా.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు వసతులు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఏటా మండలం నుంచి పదో తరగతి పూర్తిచేస్తున్న 500మందిలో పలువురు అక్కడితోనే చదువు ముగించాల్సి వస్తోంది.

ప్రభుత్వ హైస్కూల్‌లో ఓకే..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరిపడా భవనాలు ఉన్నందున కాలేజీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. షిఫ్ట్ విధానంలో బోధనకు అనుకూలంగా భవనాలు ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే పాఠశాల ఉండడంతో రాకపోకలకు కూడా సమస్య ఉండదు. అంతేకాక హైస్కూల్ పక్కన 1-30 ఎకరాల ఎన్నెస్పీ స్థలం ఖాళీగా ఉంది. ఆ స్థలంలో కాలేజీకి అవసరమైన భవనాలు నిర్మించొచ్చు.

2017లో మంత్రుల హామీ

తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు 2017లో అప్పటి ఆర్ అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని కోరారు. ఆ విద్యాసంవత్సరమే కాలేజీ ఏర్పాటుచేయాలన్న వినతికి మంత్రులు సానుకూలంగా స్పందించినా సాంకేతిక కారణాలతో సాధ్యం కాలేదు. ఆతర్వాత ఏడాది నుంచి కళాశాల మొదలవుతుందని చెప్పినా కలగానే మిగిలిపోయింది. ప్రతీ ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు హామీ ఇవ్వడం.. ఆతర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది.

ఆక్రమణకు గురైన స్థలం

నలభై ఏళ్ల క్రితమే తల్లాడ మండలం మల్లారం సమీపాన ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటుకు 170 సర్వే నంబర్‌లో రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అయితే అప్పట్లో కళాశాల మంజూరు కాక స్థలం కొన్నేళ్లు ఖాళీగానే ఉంది. ఆతర్వాత క్రమక్రమంగా ఆక్రమణకు గురైంది. ఆ స్థలంలో ఇప్పుడు స్థానికులు పంటలు పండిస్తుండగా.. రెవెన్యూ ఉద్యోగులు నోటీసులు జారీ చేస్తే కోర్టును ఆశ్రయించడంతో కేసు కొనసాగుతోంది.


మల్లవరం సమీపాన ఆక్రమణలో ఉన్న స్థలం (ఫైల్)

కాలేజీ ఏర్పాటు అవసరం



వచ్చే విద్యాసంవత్సరంకల్లా తల్లాడలో జూనియర్ కాలేజీ ఏర్పాటుచేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. పలువురు పదో తరగతి పూర్తిచేశాక ప్రభుత్వ కాలేజీ లేక చదువు మానేస్తున్నామని చెబుతున్నారు. అయితే, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, తల్లాడ

మాకు ఉపయోగం



కళాశాల ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగపడుతుంది. మాలాంటి పేద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. అందువల్ల తల్లాడలో వచ్చే ఏడాదైనా కాలేజీ ప్రారంభిస్తే ఎక్కడకు వెళ్లకుండా స్థానికంగానే చదువుకోవచ్చు.

– శ్రీవాస్తవ్య, పదో తరగతి, తల్లాడ హైస్కూల్

ప్రైవేట్‌లో రూ.వేలాది ఫీజులు



తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. కళాశాల లేక మాలాంటి పేద విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రైవేట్ కాలేజీల్లో చేరితే రూ.వేలల్లో ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అందరికీ స్థోమత లేనందున ప్రభుత్వ కాలేజీ ఏర్పాటు చేయాలి.

– జి.అజయ్‌కుమార్, పదో తరగతి, తల్లాడ

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వైరారూరల్: మండలంలోని గరికపాడు జెడ్పీహెచ్‌ఎస్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఒక చోటకు చేరారు. నలభై ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారు సమావేశమై బతుకమ్మ, ఇతర ఆటపాటలతో సందడి చేశారు. ఈ బ్యాచ్‌కు చెందిన కొండయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆనాటి గురువులు జయలక్ష్మి, షేక్ వలీజాన్, తుమ్మ వీరభద్రరావుతో పాటు ప్రస్తుత ఉపాధ్యాయులు సత్యనారాయణ తదితరులను సన్మానించారు.

యూరియా పంపిణీకి సబ్‌సెంటర్ల ఏర్పాటు


యూరియా అందిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్, ఏఓ

కల్లూరురూరల్: పీఏసీఎస్‌ల్లోనే యూరియా పంపిణీ చేస్తే రద్దీ పెరుగుతున్నందున కల్లూరు మండలంలోని పీఏసీఎస్‌ల పరిధి గ్రామాల్లోనూ సబ్‌సెంటర్లు ఏర్పాటు చేశారు. కల్లూరు సొసైటీ పరిధి బత్తులపల్లి, పడమర లోకవరం, చెన్నూరు సొసైటీ పరిధి ఎర్రబోయినపల్లి, పోచవరంసొసైటీ పరిధి వెన్నవల్లి, చిన్న కోరుకొండి సొసైటీ పరిధి తెలగవరంల్లో సబ్ సెంటర్లు ఏర్పాటు చేయగా యూరియా పంపిణీ మొదలైంది. తద్వారా రైతులకు దూరాభారం తప్పుతుందని భావిస్తున్నారు. పడమరలోకవరం సబ్ సెంటర్‌లో మంగళవారం రైతులకు మార్కెట్ చైర్‌పర్సన్ బాగం నీరజాదేవి, ఏఓ రూప యూరియా అందచేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడికి సన్మానం


అబ్రహాంను సన్మానిస్తున్న స్విమ్మర్లు

మధిర: తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మధిర నూతన అధ్యక్షుడిగా ఆదూరి అబ్రహం ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యాన సన్మానించారు. అసోసియేషన్ బాధ్యులు లింగంపల్లి అప్పారావు, వల్లపోతుల ప్రసాదరావు, జంగా శ్రీనివాసరెడ్డి, తూములూరి రాజా, చల్లా సత్యనారాయణ, కొలగాని శ్రీనివాసరావు, పిల్లి నరసింహారావు, అలా ఆరోగ్యవరప్రసాద్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత


కొణిజర్ల : రాజేష్ కుటుంబానికి నగదు అందజేస్తున్న జేసీబీ ఓనర్లు

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేటకు చెందిన ఇసనపల్లి కృష్ణ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ప్రైవేట్ ఆస్పత్రుల పీఆర్వోల యూనియన్ అధ్యక్షుడు సింగారావు శ్రీనివాస్ ఆధ్వర్యాన మంగళవారం రూ.32వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని విజయ్, కె.రామారావు, షేక్ జానీపాషా పాల్గొన్నారు.

జేసీబీ డ్రైవర్ కుటుంబానికి

కొణిజర్ల: కొణిజర్లకు చెందిన జేసీబీ డ్రైవర్ కంటు రాజేష్ మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనం పైనుంచి పడడంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని మంగళవారం జేసీబీ ఓనర్ల అసోసియేషన్ బాధ్యులు పరామర్శించి రూ.16,500నగదు, క్వింటాన్నర బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా అశోక్, వెంపటి శ్యామ్, రాజా, మధు, యాదయ్య, వెంకన్న, నాగన్న, కోటి, రాజు, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి

వేంసూరు: వేంసూరులోని అంగన్‌వాడీ సెంటర్-4లో పని చేస్తున్న టీచర్‌గా కిన్నెర విజయలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు. ఆమెకు మంగళవారం ఉదయం గుండె నొప్పి రాగా ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. కాగా, విజయలక్ష్మి మృతిపై ఐసీడీఎస్ అధికారులు, యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.

సంక్షిప్తంగా..

మున్సిపల్ కార్మికులకు వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న మనోరమారెడ్డి

మధిర: మధిర మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి రమ ప్రసూతి, జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యాన మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోరమారెడ్డి పరీక్షలు నిర్వహించి పల సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటుచేశామని తెలిపారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ రేవతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని: మండలంలోని నేరడకు చెందిన ఆమడాల వెంకటేష్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.19,500 చెక్కును సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేష్ వైద్యఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సిఫారసుతో సాయం మంజూరైందని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు చెవుల తిరుపతిరావు, గోగుల ఆదినారాయణ, వెంకట్రావు, బత్తుల కృష్ణ, మక్కాల నాగరాజు, గుత్తికొండ లక్ష్మి, ఆమడాల అలీషా పాల్గొన్నారు.

అండర్ టన్నెల్ మరమ్మతులకు నిధులు

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల వద్ద ఇబ్రహీంపట్నం మేజర్ కెనాల్, జమలాపురం సమీపాన మైలవరం బ్రాంచ్ కెనాల్ వద్ద దెబ్బతిన్న అండర్ టన్నెల్(యూటీ) మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫారసుతో రూ.1.67 కోట్లు మంజూరయ్యాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు భట్టికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కంప చెట్లు తొలగింపు

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు ఇందిరమ్మ కాలనీ సమీపాన ఎన్నెస్పీ కాల్వలో పెరిగిన కంప చెట్లను గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం జేసీబీ సాయంతో తొలగించారు. అంతేకాక ఇళ్లలోకి, రహదారులపైకి నీరు ప్రవహించకుండా పనులు చేపట్టారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, కాంగ్రెస్ నాయకులు బుంగ నరేష్, వేల్పుల సురేష్, కొమ్ము ప్రసాద్, పస్తం ముత్తిలింగం, వేల్పుల రామారావు, మొండితోక సురేష్, బేతపూడి చిరంజీవి, మొండితోక జమలయ్య పాల్గొన్నారు.

టీజీవోస్ మహిళా విభాగంలో స్థానం

కారేపల్లి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్ మహిళా విభాగం వైస్ చైర్‌పర్సన్‌గా కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విజయకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, కళాశాల తెలుగు లెక్చరర్ పి.సుధారాణి కో-చైర్‌పర్సన్‌గా స్థానం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజయకుమారి, సుధారాణిని సన్మానించారు. అధ్యాపకులు దుర్గాప్రసాద్, యాకయ్య, శ్రీనివాసరావు, వనిత, పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం సొసైటీ పరిధి గ్రామాలకు చెందిన 15మంది రైతులకు మంగళవారం మండల కేంద్రంలోని డీసీసీబీ బ్రాంచ్‌లో రూ.15.60 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, బ్యాంక్ మేనేజర్ దివ్య మాట్లాడుతూ రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, ఉద్యోగులు మౌనిక, జానీ, సీతఊట మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంకు చెందిన కంకణాల అర్జునరావు ఇటీవల మరణించగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి బీమా పరిహారం మంజూరైంది. ఆయన రూ.32,705కు పాలసీ చేయగా, రూ.5,85,500 బీమా పరిహారం మంజూరైంది. ఈమేరకు అర్జునరావు భార్య సునీతకు చెక్కును శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బాధ్యులు గంగుల సతీష్‌కుమార్, భరత్‌కుమార్, ఉపేందర్, వెంకటేశ్వర్లు, రవి అందజేశారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

చింతకాని: మండలంలోని మత్కేపల్లిలో అవసరమైన చోట 40 విద్యుత్ స్తంభాలను మంగళవారం అధికారులు ఏర్పాటు చేయించారు. ఏఈ ఉమామహేశ్వరి మాట్లాడుతూ కొత్తగా ఇళ్లు నిర్మించిన ప్రాంతాలతో పాటు, స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉన్న చోట కొత్తవి స్తంభాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కంచం కోటేశ్వరరావు, వలమల రామారావు, గోద వెంకన్న, తిరుపతి సంజీవరావు, విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, లైన్‌మెన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

చింతకాని: మారుతున్న వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ సూచించారు. మండలంలోని రామకృష్ణాపురంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్తాఫ్ మాట్లాడుతూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే వ్యాధులు దరిచేరవని తెలిపారు. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టి నిల్వ నీటిని తొలగించారు. పల్లెదవాఖానా వైద్యులు తబుసుం, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఏన్కూరు : అమ్మవారి వద్ద పూజలో భక్తులు


వైరారూరల్: ముసలిమడుగులో గాయత్రీదేవిగా..

గాయత్రీదేవిగా కనకదుర్గమ్మ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన అమ్మ వారి విగ్రహాలను గాయత్రీదేవి రూపంలో అలంకరించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గాయత్రీదేవి రూపం ప్రత్యేకతలను వివరించారు. అలాగే, భవానీ మాలధారుల సమక్షాన ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ జరిగాయి. అయితే, ఇంకొన్నిచోట్ల బాలత్రిపుర సుందరీదేవి, చండికా దుర్గాదేవి రూపాల్లోనూ అమ్మవారిని అలంకరించారు.

– సాక్షి నెట్‌వర్క్


కల్లూరురూరల్ : గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు


సత్తుపల్లిటౌన్ : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


చింతకాని : నాగులవంచలో పూజలు..


ముదిగొండ : పెద్దమండవలో అమ్మవారు

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గురులింగం

వైరా: వైరాలోని వివిధ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యాన ఏర్పాట్లుచేస్తున్నారు. ఈమేరకు వైరా రింగ్ రోడ్డు నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 35 హైమాస్ట్ లైట్లను మంగళవారం ఏర్పాటు చేయించారు. బతుకమ్మలతో వచ్చే మహిళలకు ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లుచేస్తున్నామని కమిషనర్ యు.గురులింగం తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించగా, ప్రిన్సిపాల్ బి.జైదాస్ మాట్లాడారు. రోడ్డు భద్రతపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండడమే కాక హెల్మెట్, సీట్ బెల్ట్ ఆవశ్యకతపై ఇతరులకు వివరించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.తౌరియా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈనెల 27న మెగా రక్తదాన శిబిరం


శిబిరం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు


వైరా: తలసేమియా బాధితచిన్నారుల కోసం ఆశ్రయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన వైరా ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 27న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు కార్యక్రమ పోస్టర్లను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. చిన్నారుల కోసం యువత పెద్దసంఖ్యలో రక్తదానంచ చేయాలని సూచించారు. నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, దొబ్బల సౌజన్య, ఏదునూరి సీతారాములు, దాసరి దానియేలు, మచ్చా బుజ్జి, దొడ్డ పుల్లయ్య, ఫౌండేషన్ సభ్యులు ఇరుగు నవీన్, నారపోగు ఉదయ్, యంగల వెంకటేష్, కాంపల్లి శ్రీను, నంబూరి అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టాంజనేయస్వామి ఆలయ పాలకవర్గం ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ బాధ్యులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీ మెట్టాంజనేయస్వామి ఆలయ నూతన పాలకవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా మల్లూరు అంకమరాజు, కోశాధికారిగా గోగినేని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా చీపు సురేష్, సంయుక్త అల్లాడి రాము, ఉప కోశాధికారిగా ముద్దు వెంకటరమణ, ప్రచార కార్యదర్శిగా కాశిని శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయగా, భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. గౌరవ అధ్యక్షుడు మాధురి మధుతో పాటు మందపాటి రవీందర్‌రెడ్డి, కాలినేని కాంతారావు, జగ్గవరపు చెన్నారెడ్డి, దేశిరెడ్డి కేశవరెడ్డి, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ల నర్సింహారావు, కాశిని చెన్నయ్య, చిట్టియ్య, రంగపురి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలి


ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న నాయకులు


బోనకల్: మండలంలోని కలకోట ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. ఎత్తిపోతల పథకాన్ని మంగళవారం సీపీఐ నాయకులు పరిశీలించగా ఆయన మాట్లాడారు. రాళ్లవాగు ఒడ్డున ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారడంతో సుమారు 600 ఎకరాల్లో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విన్నవించినందున తక్షణమే ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించాలని డిమాండ్‌చేశారు. నాయకులు బలుగురి అచ్చయ్య, తోటపల్లి దావీదు, కడుపుగంటి గోపి, గద్దల శేషగిరిరావు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

27న ఉమ్మడి ఏకపాత్రాభినయం పోటీలు


పోటీల వివరాలు వెల్లడిస్తున్న కళాకారులు

ఎర్రుపాలెం: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎర్రుపాలెం మండలం లక్ష్మీపురంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయిలో పౌరాణిక ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాకారుల సంఘం బాధ్యులు బూసిపల్లి శశిభూషణరెడ్డి, గూడురు రమణారెడ్డి తెలిపారు. ఈనెల 27న పోటీలు జరగనుండగా, ఆసక్తి ఉన్నవారు 96666 13391, 95057 73759 నంబర్లలో సంప్రదించి రూ.300 ఫీజు చెల్లించాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచే వారితో పాటు పది మందికి ప్రత్యేక బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈసమావేశంలో ముల్లంగి గాబ్రేలు, నరాల సాంబశివారెడ్డి, యర్రగుంట రాజేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్'పై పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని పలు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 'ఆపరేషన్ సిందూర్'పై అవగాహన కల్పించేందుకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యాన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బీజేపీ జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు బహుమతులు అందజేశారు. నాయకులు శివ, పాలకొల్లు శ్రీనివాస్, నాగేందర్‌రెడ్డి, కార్తీక్, శేషగిరిరావు పాల్గొన్నారు.